క్లుప్తంగా

వైభవంగా జాతర



జాతరలో ఆకట్టుకున్న గరగ నృత్యాలు

బిక్కవోలు: ఆరికరేవుల గ్రామంలోని వెలంపేట కొలువైన గొల్లాలమ్మ, గోగులమ్మ అమ్మవార్ల జాతర సోమవారం రాత్రి అంగరంగ వైభవంగా నిర్వహించారు. గరగ నృత్యాలు, తీన్‌మార్ డప్పులు, శక్తి వేషధారణలు, బాణసంచా నడుమ ఎంతో ఘనంగా ఈ కార్యక్రమం జరిగింది. పెద్దసంఖ్యలో భక్తులు తరలివచ్చి, అమ్మవార్లను దర్శించుకున్నారు.

నేలకొరిగిన అరటి తోటలు



వంగలపూడిలో నేలకొరిగిన అరటి తోట

సీతానగరం: మండలంలోని పలు గ్రామాల్లో ఆదివారం సాయంత్రం వీచిన ఈదురు గాలులకు అరటి, కూరగాయల పాదులు నేలకొరిగాయి. చేతికి వచ్చే సమయంలో అరటి తోటలు నేలకొరగడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. అలాగే కాకర, దొండపాదులు కూడా పడిపోయాయి. మామిడి చెట్ల నుంచి కాయలు రాలిపోవడంతో రైతులకు నష్టం కలిగించింది.

ఆర్టీ యాక్టివిస్టు అసోసియేషన్ అధ్యక్షుడిగా సురేంద్ర కుమార్



సీతానగరం: సమాచార హక్కు కార్యకర్తల సంఘం (ఆర్టీ యాక్టివిస్ట్ అసోసియేషన్) జిల్లా అధ్యక్షుడిగా రఘుదేవపురానికి చెందిన దంగేటి సురేంద్ర కుమార్ ఎన్నికయ్యారు. ఏలూరులోని ఏపీ తెలంగాణ ఆర్టీ యాక్టివిస్ట్ అసోసియేషన్ కార్యాలయంలో సోమవారం ఆ అసోసియేషన్ వ్యవస్థాపకుడు, ప్రెసిడెంట్ గేదెల ముత్తయ్య చేతుల మీదుగా నియామక పత్రాలను అందుకున్నారు. ఈ సందర్భంగా సురేంద్ర కుమార్ మాట్లాడుతూ సమాచార హక్కు చట్టం అనేది ప్రజల చేతుల్లోని శక్తివంతమైన సాధనమన్నారు. దీనిపై ప్రజల్లో చైతన్యం తీసుకువచ్చేందుకు కృషి చేస్తానన్నారు. ప్రభుత్వ శాఖల నుంచి సమాచారం పొందడం ప్రతి పౌరుడి హక్కు మాత్రమే కాక, సామాజిక బాధ్యతగా చూడాలన్నారు.

సినిమాకు స్పందన అద్భుతం



విలేకరులతో మాట్లాడుతున్న హీరో ప్రదీప్, చిత్రంలో హీరోయిన్ దీపిక, దర్శకులు నితిన్, భరత్

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): ప్రేక్షకులను నవ్వించడానికి చేసిన ప్రయత్నం ఫలించి, సినిమాకు అద్భుత స్పందన లభిస్తోందని 'అక్కడ అమ్మాయి.. ఇక్కడ అబ్బాయి' హీరో ప్రదీప్ మాచిరాజు ఆనందం వ్యక్తం చేశారు. ప్రేక్షకుల ఆనందాన్ని స్వయంగా చూడటానికే థియేటర్లకు వస్తున్నామన్నారు. ప్రదీప్ మాచిరాజు, దీపికా పిల్లి హీరో హీరోయిన్లుగా నటించిన ఈ చిత్రానికి నితిన్ – భరత్ దర్శకత్వం వహించారు. చిత్ర విజయోత్సవ యాత్రలో భాగంగా స్థానిక కుమారి థియేటర్‌కు మ్యాట్నీషో సమయంలో సోమవారం చిత్ర బృందం విచ్చేసింది. వారికి డప్పు వాయిద్యాల నడుమ చిత్రాన్ని పంపిణీ చేసిన మైత్రి ఫిలిం డిస్ట్రిబ్యూటర్స్ ఉదయ్ రాణా, సత్తి రెడ్డి సాదర స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ప్రదీప్ మాచిరాజు, దీపికా పిల్లి ప్రేక్షకులతో మాట్లాడారు. సినిమాను ఆదరిస్తున్న అందరికీ కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం థియేటర్ ఆవరణలో ప్రదీప్ మాచిరాజు మీడియాతో మాట్లాడుతూ సినిమాను ప్రేక్షకులు బాగా ఎంజాయ్ చేస్తున్నారని, సినిమాలో కామెడీ బాగుందని అందరూ మెచ్చుకుంటున్నారని అన్నారు. ప్రతి ఒక్కరూ పిల్లలతో సహా సినిమాకు వచ్చి వీక్షించాలని కోరారు.త్వరలో మరో మంచి ప్రాజెక్ట్ తో వస్తామని ప్రదీప్ చెప్పారు.దర్శకులు నితిన్ – భరత్ మాట్లాడుతూ కథ, మాటలు రాసుకున్నట్టుగానే సినిమా తీశామని, ప్రేక్షకుల నుంచి మంచి రెస్పాన్స్ వస్తోందన్నారు.

ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటం

ప్రకాశం నగర్: కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలపై దశల వారీగా పోరాటం చేస్తామని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు అక్కినేని వనజ అన్నారు. తాడితోట శాఖ సోమవారం ఏర్పాటు చేసిన రాజకీయ ప్రచార జాతా ముగింపు సభకు ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కార్మికులు పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను కేంద్రం నాలుగు లేబర్ కోడ్‌లుగా విభజించి, కార్మికుల హక్కులను కాలరాస్తోందని విమర్శించారు.

అంబేడ్కర్ స్ఫూర్తితో జగనన్న పాలన

- మాజీ ఎమ్మెల్యేలు జక్కంపూడి రాజా, డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి
- ఘనంగా బాబాసాహెబ్ జయంత్యుత్సవం

రాజానగరం: బడుగు, బలహీన వర్గాల సంక్షేమం కోసం పాటు పడిన మహనీయుడు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ స్ఫూర్తితోనే జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో ముఖ్యమంత్రిగా ఐదేళ్లపాటు ప్రజారంజక పాలన అందించారని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు జక్కంపూడి రాజా అన్నారు. కొండగుంటూరులో కుండా కృపావరం ఆధ్వర్యంలో నిర్వహించిన అంబేడ్కర్ జయంతిలో విగ్రహానికి పూలమాల వేసి, ఘనంగా నివాళులర్పించారు. అలాగే దివాన్ చెరువు, కానవరం, కొత్తతుంగపాడు, పాతతుంగపాడులలో జరిగిన కార్యక్రమాలకు మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా హాజరయ్యారు.

బడుగుల ఆశాజ్యోతి

పెదపూడి: బడుగు జీవుల ఆరాధ్య దైవం, ఆశాజ్యోతి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అని వైఎస్సార్ సీపీ అనపర్తి నియోజకవర్గ కో ఆర్డినేటర్, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. అనపర్తిలోని పాత ఊరు నల్ల కాలువ వద్ద పాతపేటలో సోమవారం అంబేడ్కర్ జయంతిని ఘనంగా నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే సూర్యనారాయణరెడ్డి ముఖ్య అతిథిగా హాజరై అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ అంబేడ్కర్ ఆశయాలు భావి తరాలకు మార్గదర్శకాలన్నారు. కార్యక్రమంలో



అనపర్తిలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న మాజీ ఎమ్మెల్యే సూర్యనారాయణరెడ్డి

సర్పంచ్ వారా కుమారి, జెడ్పీటీసీ సభ్యురాలు సత్తి గీతా వరలక్ష్మి, అనపర్తి ఏఎంసీ చైర్మన్ సబ్బెళ్ల కృష్ణారెడ్డి, పార్టీ నాయకులు కాశీ డేవిడ్‌రాజు, కొండేటి భీమేష్, పోతులు ప్రసాదరెడ్డి, సత్తి పోతారెడ్డి, వాసంశెట్టి కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

విద్యతోనే మార్పు సాధ్యం

రాజానగరం: విద్యతోనే సమాజంలో మార్పు సాధ్యమని నమ్మిన మహనీయుడు అంబేడ్కర్ అని ఆదికవి నన్నయ యూనివర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్ అన్నారు. క్యాంపస్‌లోని సెంట్రల్ లైబ్రరీ వద్ద ఉన్న ఆయన విగ్రహానికి పూలమాల వేసి, నివాళులర్పించారు. ఆయనను ఆశయాలను ఆదర్శంగా తీసుకుని గురువులు విద్యార్థులకు చక్కని మార్గనిర్దేశం చేయాలని సూచించారు. కార్యక్రమంలో యూనివర్సిటీ అధికారులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఆచరణీయం



కొండగుంటూరులో జరిగిన అంబేడ్కర్ జయంతిలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

అంబేడ్కర్ ఆశయాలు, ఆలోచనలు ఆచరణీయమని ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ అన్నారు. మండలంలోని దివాన్‌చెరువు, ఫరిజల్లిపేట, సూర్యారావుపేట, నరేంద్రపురం, మల్లంపూడి, పాతతుంగపాడు, శ్రీకృష్ణపట్నం, లాలాచెరువు హెచ్‌బీ కాలనీలో జరిగిన కార్యక్రమాలలో ఎమ్మెల్యేతో పాటు కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సీతానగరం మండలంలో..

సీతానగరం: మండలంలోని అన్ని గ్రామాల్లో అంబేడ్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అంబేడ్కర్ యూత్ ఆధ్వర్యంలో బైక్ ర్యాలీలు నిర్వహించారు. సీతాగనగరం తహసీల్దార్ ఎ.శ్రీనివాస్ ఆధ్వర్యంలో అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేశారు.సర్వే డీటీ మూర్తి, వీఆర్వోలు, వీఆర్ఏలు పాల్గొన్నారు.

- సీతానగరం పోలీస్ స్టేషన్‌లో ఎస్సై డి.రామ్ కుమార్ తన సిబ్బందితో అంబేడ్కర్ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. సీతానగరం ప్రభుత్వ డిగ్రీ కళాశాల్లో ప్రిన్సిపాల్ డాక్టర్ డి.చిట్టిబాబు ఆధ్వర్యంలో అంబేడ్కర్ జయంత్యుత్సవం జరిపారు.

దళితుల అభ్యున్నతికి కృషి

పెదపూడి: దళితుల అభ్యున్నతికి విశేష కృషి చేసిన మహనీయుడు అంబేడ్కర్ అని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. అనపర్తి మండలం రామవరం గ్రామంలో జరిగిన జయంతి కార్యక్రమంలో ఆయన, టీడీపీ నేత నల్లమిల్లి మనోజ్ పాల్గొన్నారు. అనంతరం అనపర్తి పాత ఎస్సీ పేటలో కార్యక్రమానికి హాజరయ్యారు. అనపర్తిలో అగ్నిమాపక శాఖ ఆధ్వర్యంలో నిర్వహించే వారోత్సవాలను ఎమ్మెల్యే ప్రారంభించారు.

మహోన్నతుడు అంబేడ్కర్

బిక్కవోలు: దేశానికి అత్యుత్తమ, పటిష్ఠ రాజ్యాంగాన్ని అందించిన మహోన్నతుడు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అని ఎంపీడీవో వి.శ్రీనివాస్ అన్నారు. బిక్కవోలు మండల పరిషత్ కార్యాలయంలో అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

- పందలపాకలో సర్పంచ్ సబ్బారపు పద్మావతి, ఉప సర్పంచ్ పడాల వెంకట రామారెడ్డి తదితరులు.. అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.
- ఆరికరేవుల గ్రామంలో మాజీ ఎంపీటీ సభ్యులు బొడ్డు వెంకట సూర్యనారాయణ, వైఎస్సార్ సీపీ నాయకుడు, మాజీ ఏఎంసీ డైరక్టర్ గురు నాగు తదితరులు జయంత్యుత్సవం నిర్వహించారు. బలభద్రపురం గ్రామంలో సర్పంచ్ బుంగా రామారావు, మాజీ ఎంపీటీసీ నల్లమిల్లి వెంకట సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.
- పందలపాక, ఊలపల్లి, కొంకుదురు, బిక్కవోలు గ్రామాల్లో అంబేడ్కర్ విగ్రహాలకు పూలమాల వేసి నివాళులు అర్పించారు. కాపవరంలో అంబేడ్కర్ యూత్ ఆధ్వర్యంలో వేడుకలు జరిగాయి.

అసమానతల నిర్మూలన

రంగంపేట: సమాజంలో అసమానతల నిర్మూలనకు అంబేడ్కర్ ఎంతో కృషి చేశారని జెడ్పీటీసీ సభ్యుడు పేపకాయల రాంబాబు అన్నారు. రంగంపేట ఎస్సీ కాలనీలో అంబేడ్కర్ జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విగ్రహానికి రాంబాబు పూలమాలల వేసి నివాళులర్పించారు. వడిశలేరు, రంగంపేట, మర్రిపూడి, దొడ్డిగుంట, ఎస్టీ రాజాపురం, సింగంపల్లి, జి.దొంతమూరు, సుభద్రంపేట గ్రామాల్లో ఆయా గ్రామాల సర్పంచ్‌లు కొల్లాటి శ్యామలావతి, బలిరెడ్డి లక్ష్మి, వేము మాధవి, నల్లా పద్మ, కారి సంజీవరావు, అడ్డాల పద్మ , తుట్టా శివశంకర్ ఆనంద్, గోలి రమణ, కూటి సాయితాతారావు తదితరుల ఆధ్వర్యంలో అంబేడ్కర్ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి.

బహుముఖ ప్రజ్ఞాశాలి

కోరుకొండ: అంబేడ్కర్ బహుముఖ ప్రజ్ఞాశాలి అని మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా అన్నారు. నిడిగట్లలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. జంబూపట్నంలో అంబేడ్కర్ విగ్రహాన్ని విశ్రాంత ప్రభుత్వ ఉద్యోగి, విగ్రహ దాత నాంబత్తుల జంగాలయ్య ఆవిష్కరించారు. బూరుగుపూడి, దోసకాయలపల్లి, నిడిగట్ల గ్రామాల్లో జరిగిన కార్యక్రమానికి నార్త్‌జోన్ డీఎస్పీ వై.శ్రీకాంత్ హాజరయ్యారు. దోసకాయలపల్లిలో జెడ్పీటీసీ సభ్యుడు కర్రి నాగేశ్వరరావు మాట్లాడుతూ అంబేడ్కర్ సేవలు చిరస్మరణీయమన్నారు. బూరుగుపూడిలో ఏడిద ప్రసన్నకుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్ర మంలో వైఎస్సార్ సీపీ నాయకుడు కంటే వినయ్ తేజ మాట్లాడారు. కోరుకొండ, జంబూపట్నం. కోటికేశవరం గ్రామాల్లో అంబేడ్కర్ జయంత్యుత్సవాలు నిర్వహించారు.



సీతానగరం తహసీల్దార్ కార్యాలయంలో..



రంగంపేటలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న జెడ్పీటీసీ రాంబాబు

అంబేడ్కర్ అందరివాడు

పెదపూడి: రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అందరి వాడు అని పెదపూడి ఎస్సై కె.రామారావు అన్నారు. పెదపూడిలో అంబేడ్కర్ యూత్ ఆధ్వర్యంలో జయంతి వేడుకలునిర్వహించారు. కార్యక్రమానికి గ్రామ పెద్దలు యార్లగడ్డ అమ్మన్న చౌదరి(పెద్దబ్బు), నల్లమిల్లి గంగిరెడ్డి, సర్పంచి కలవల కృష్ణమూర్తి ముఖ్య అతిథులుగా హాజర్యారు. సంపరలో జరిగిన కార్యక్రమంలో ఎస్సై కె.రామారావు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు.

- జి.మామిడాడలో వైఎస్సార్ సీపీ పార్టీ రాష్ట్ర ప్రచార కమిటీ కార్యదర్శి మండ రాజారెడ్డి, మండల కన్వీనర్ గుత్తుల రమణ, గంధ్రేడు,పైన గ్రామాల సర్పంచులు కుడిపూడి మాధవిలత, సుందరపల్లి ప్రమీల తదితరులు పాల్గొన్నారు.
- మండల పరిషత్ కార్యాలయం వద్ద జరిగిన కార్యక్రమంలో ఎంపీపీ కేతా తులసి, ఎంపీడీఓ కొవ్వూరి నరేంద్రరెడ్డి, పీఏసీఎస్ మాజీ చైర్మన్ పుట్టా గంగాధర్ చౌదరి తదితరులు అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పించారు.
- శహాపురంలో ఆంధ్రప్రదేశ్ రైతుకూలీ సంఘం , దళిత యువసేన, పలు ప్రజా సంఘాల నాయకులు ఆధ్వర్యంలో వేడుకలు జరిగాయి.
- కరకుదురులో అంబేడ్కర్ జయంతి సందర్భంగా అంబేడ్కర్ యూత్ నిర్వహించిన రాష్ట్ర స్థాయి ఇన్విటేషన్ వాలీబాల్ పోటీల్లో 26 జట్లు పాల్గొన్నాయి. వాటిలో కడప జిల్లా ప్రథమ, కరకుదురు ద్వితీయ, నడకుదురు జట్టు తృతీయ స్థానాలు సాధించాయి. స్థానిక సేవాకీయం ట్రస్ట్ అధినేత తలాటం మురళీ విజేత జట్లకు నగదు ప్రోత్సాహకాలు ఏర్పాటు చేశారు. విజేతలకు రూ.22,222, రూ.11,111, రూ.7,777తో పాటు మెమోంటోలు అందించారు. వాటిని ట్రస్ట్ వైస్ చైర్మన్ పాటంశెట్టి త్రిమూర్తులు, సర్పంచ్ వుంద్రు చంద్రకళ, పెద్దాడ సాగునీటి డీసీ చైర్మన్ సానా శ్రీను, మాజీ సర్పంచ్ సింగినీడి నాగతిరుపతిరావు తదితరుల చేతుల మీదుగా పంపిణీ చేశారు.



పెదపూడి మండల పరిషత్ కార్యాలయంలో నివాళులర్పిస్తున్న ఎంపీపీ కేతా తులసి



నన్నయ వర్సిటీలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న రిజిస్ట్రార్ ఆచార్య సుధాకర్



ఆరికరేవులలో అంబేడ్కర్ జయంతిలో పాల్గొన్న వైఎస్సార్ సీపీ నాయకులు



జంబూపట్నంలో అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న జంగాలయ్య తదితరులు

కోరుకొండ నరసన్న ఆలయానికి రోప్‌వే



రోప్ వే నమూనా



రోప్ ఏర్పాటుపై అధికారులతో మాట్లాడుతున్న జక్కంపూడి రాజా (ఫైల్)

రాజానగరం: పర్యాటక రంగాన్ని అభివృద్ధి చేయడంలో భాగంగా రాష్ట్రంలో ఐదు ప్రధాన ప్రాంతాలలో రోప్ వేలను నిర్మించనున్నారు. ఇందుకు సంబంధించిన పనులకు నేషనల్ హైవేస్ డీపీఆర్ తయారీకి టెండర్లు ఆహ్వానించింది. ఈ మేరకు కోరుకొండ లక్ష్మీనరసింహస్వామి ఆలయంతో పాటు చిత్తూరు జిల్లాలోని బోయకొండ గంగమ్మ, కర్నూలులోని ఆహోబిలం దేవస్థానం, పల్నాడులోని కోటప్పకొండ, విజయవాడలోని భవానీ ద్వీపాలలో ఏర్పాటు చేయనున్నారు. కోరుకొండలోని లక్ష్మీనరసింహస్వామి కొండకు కాపవరంలోని బౌద్ధ కొండకు రోప్‌వే వేసి, పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేసేందుకు గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో అప్పటి ఎమ్మెల్యే జక్కంపూడి రాజా చర్యలు తీసుకున్నారు. సంబంధిత అధికారుల ద్వారా కేంద్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించారు. అప్పట్లోనే సర్వే కూడా చేశారు. నేటికి అవి కార్యరూపం దాల్చనున్నాయి. అయితే బౌద్ధ కొండ నుంచి కాకుండా లక్ష్మీనరసింహస్వామి ఆలయం దిగువ నుంచి కొండ పైకి ఉన్న మెట్ల మార్గానికి సమాంతరం సుమారు 0.25 కిలోమీటర్ల దూరం రోప్ వే వేసేలా ప్రతిపాదనలలో మార్పులు చేశారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలోనే మెట్ల మార్గం, రాజగోపురం, రంగనాథస్వామి ఆలయ పునఃనిర్మాణానికి నిధులు మంజూరు చేయించి, త్రిదండి చినజియర్‌స్వామిచే భూమి పూజ చేయించడం, గిరి ప్రదక్షణను ఏర్పాటు చేయడం జరిగింది.

సామాజిక మాధ్యమంలో పోస్టింగ్‌తో ఘర్షణ

- ముగ్గురికి తీవ్ర గాయాలు
- లంకూరులో పోలీస్ పికెట్

సీతానగరం:సామాజిక మాధ్యమంలో పెట్టిన పోస్టింగ్‌తో ఇరు గ్రామాల యువకుల మధ్య ఘర్షణ జరిగింది. ముగ్గురికి తీవ్రంగా గాయాలయ్యాయి. వివరాల్లోకి వెళ్లితే అంబేడ్కర్ జయంతి సందర్భంగా రాపాకకు చెందిన ఓ యువకుడు సామాజిక మాధ్యమంలో పెట్టిన పోస్టింగ్‌కు సీతానగరం పంచాయతీ పరిధిలోని లంకూరుకు చెందిన అదే సామాజిక వర్గం యువకుడు నవ్వుతూ ఉండే సింబల్ పోస్ట్ చేశాడు. దీంతో ఆగ్రహం చెందిన రాపాక యువకులు లంకూరు చేరుకుని వారిని నిలదీశారు. ఇరువర్గాల యువకుల మధ్య తీవ్ర ఘర్షణకు దారి తీసి, ఒకరిపై ఒకరు దాడి చేసుకున్నారు. ఈ ఘటనలో లంకూరుకు చెందిన మన్నెల కేశవ్, ఆయన వదిన నర్రే బుజ్జి, రాపాకకు చెందిన వెలిపే సందీప్‌కు గాయాలయ్యాయి. వారిని అంబులెన్స్‌లో రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. సమాచారం అందుకున్న రాజమహేంద్రవరం క్రైం సీఐ, కోరుకొండ ఇన్‌చార్జ్ సీఐ శ్రీధర్ కుమార్, ఎస్సై డి.రామ్‌కుమార్ తమ సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకున్నారు. యువకులను చెదరకొట్టి, పోలీస్ పికెట్ ఏర్పాటు చేశారు. ఈ ఘర్షణపై విచారణ చేస్తున్నామని, కారకులను గుర్తించి తగిన చర్యలు తీసుకుంటామని సీఐ శ్రీధర్ కుమార్ తెలిపారు.



లంకూరులో స్థానికులను విచారణ చేస్తున్న పోలీసులు

ఉత్తమ కోర్సులతో ఉజ్వల భవిత

- జూనియర్ కళాశాలల్లో ఇంటర్ అడ్మిషన్లు ప్రారంభం
- గ్రూపుల ఎంపికపై విద్యార్థుల సందిగ్ధత
- ఇష్టమైన సబ్జెక్టులకు ప్రాధాన్యమివ్వాలంటున్న నిపుణులు



రంగంపేట ప్రభుత్వ జూనియర్ కళాశాల

రంగంపేట: జూనియర్ కళాశాలల్లో అడ్మిషన్లు ప్రారంభమయ్యాయి. ఇంటర్మీడియట్‌లో ఏ గ్రూపు తీసుకోవాలి, ఏది తీసుకుంటే భవిష్యత్తు బాగుంటుంది, వాటి కోసం ఎవరిని అడగాలి అనే ఆలోచనలతో విద్యార్థులు సతమతమవుతున్నారు. పదో తరగతి ఉత్తీర్ణులైన వారికి ఉన్నత విద్యకు వారధి ఇంటర్మీడియట్. ఇందులో గ్రూపు ఎంపిక అత్యంత కీలకమైన అంశం. ఇష్టమైన సబ్జెక్టులను ఎంచుకోవడానికి ప్రాధాన్యతనివ్వాలని, వాటిలో చేరి ప్రణాళికబద్ధంగా చదివితే ఉన్నత స్థాయికి చేరుకోవడం సులభతరమవుతుందని అధ్యాపకులు, విద్యావంతులు సూచిస్తున్నారు.

ఏ కోర్సులో ఏముంది?

ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, హెచ్ఈసీ గ్రూపులు అందుబాటులో ఉన్నాయి. ప్రస్తుతం అడ్మిషన్లు జరుగుతున్నాయి. ఇంటర్మీడియట్ చదవాలనుకునే విద్యార్థులు ఏ గ్రూపులో చేరితే ఏ సబ్జెక్టులుంటాయి, తదనంతరం ఆయా గ్రూపుల్లో ఉత్తీర్ణులైతే ఎలాంటి కొలువులు లభిస్తాయన్న అంశాలపై ఆయా కళాశాలల ప్రిన్సిపాళ్లు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.

బైపీసీ

ఇందులో బాటనీ, జువాలజీ, ఫిజిక్స్, కెమిస్ట్రీ సబ్జెక్టులు ఉంటాయి. ఎంసెట్, నీట్ పరీక్షల ద్వారా డాక్టర్, వైద్య సంబంధిత వృత్తులు, ఉద్యోగాల్లో స్థిరపడాలనుకునేవారికి బైపీసీ గ్రూపు ఎంతో ఉపకరిస్తుంది. అదే విధంగా అగ్రికల్చర్ కోర్సులకు ఈ గ్రూపు ప్రతిపాదిక. ఓపిగ్గా చదవడం, స్పష్టంగా సైన్సు ప్రతిపాదికన బొమ్మలు వేయడంలాంటివి ఈ గ్రూపు విద్యార్థులకు ఉండాల్సిన లక్షణం.

ఎంపీసీ

ఇందులో మ్యాథ్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ సబ్జెక్టులు ఉంటాయి. ఇంజినీరింగ్‌లో స్థిరపడాలనుకునేవారు ఈ గ్రూపు తీసుకోవచ్చు. ఎంసెట్ రాయాలనుకున్నా, సివిల్, మెకానికల్, ఎలక్ట్రికల్, కంప్యూటర్స్, ఏరోనాటికల్స్ తదితర రంగాల్లో ఇంజినీరింగ్ చేయాలనుకున్న వారికి ఈ గ్రూపు పునాది వంటిది.

సీఈసీ, ఎంఈసీ

సేవా రంగం వైపు వెళ్లేవారు ఈ గ్రూపు తీసుకోవచ్చు. దీనిలో మ్యాథ్స్, కామర్స్, ఎకనామిక్స్, సివిక్స్ సబ్జెక్ట్‌లు ఉంటాయి. చార్టెడ్ అకౌంటెంట్లు, కంపెనీ సెక్రటరీలు, కమర్షియల్ ఏజెంట్లు, బ్యాంకులలో పలు విభాగాల్లో ఉద్యోగాలు పొందాలనుకునే వారికి ఈ గ్రూపు ఎంతో ఉపకరిస్తుంది. స్టాక్ మార్కెట్‌లలో ఉద్యోగాలు పొందాలనుకునే వారు కూడా తీసుకోవచ్చు.

ఐటీఐ

ఇండస్ట్రియల్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్ కోర్సులను ఎంచుకోవడం ద్వారా విద్యార్థులు పదో తరగతి తరువాత రెండేళ్ల సాంకేతిక విద్యలో శిక్షణ పొందవచ్చు. ఎలక్ట్రికల్, డీజిల్, మెకానిక్ తదితర కోర్సులు పూర్తయిన వెంటనే ఉపాధి పొందే అవకాశం ఉంది. పరిస్థితులు అనుకూలిస్తే సాంకేతిక విద్యారంగంలో ఉన్నత స్థాయి కోర్సులను చదివే అవకాశం ఉంటుంది.

పాలిటెక్నిక్

పదో తరగతి తరువాత ఏదైనా సాంకేతిక విద్యలో నైపుణ్యం సంపాదించడానికి ఉత్తమ మార్గం పాలిటెక్నిక్ చదువే. ఇందుకోసం విద్యార్థులు పాలిటెక్నిక్‌లో ఎంట్రాన్స్‌లో ఉత్తీర్ణత సాధించాలి. మెరిట్‌పైనే ఇందులో సీట్లు వస్తాయి.

ఉత్తమ ఫలితాలు

మండల కేంద్రమైన రంగంపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 75 శాతం ఉత్తీర్ణత సాధించారు. మొదటి సంవత్సరంలో 50 శాతం మంది పాసయ్యారు. ద్వితీయ సంవత్సరం పరీక్షలు 86 మంది రాయగా, 65 మంది ఉత్తీర్ణులయ్యారు.

ఇష్టమైన గ్రూపులు ఎంచుకోవాలి



పదో తరగతి తర్వాత ఇంటర్మీడియట్‌లో చేరేవారు తమకు ఇష్టమైన గ్రూపులను ఎంచుకోవాలి. భవిష్యత్తులో ఏం చేయాలనుకుంటున్నారో నిర్ణయం తీసుకుని, అదే లక్ష్యంతో కోర్సులను ఎంపిక చేసుకుని చదవాలి. ఏది పడితే అది, ఒకరిని చూసి మరొకరు పోటీపడి కోర్సులను ఎంపిక చేసుకొని కెరియర్‌ను పాడుచేసుకోకూడదు. ఇష్టమైన సబ్జెక్టులను ఎంచుకుని అందులో రాణించాలి. మా కళాశాలలో ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, హెచ్ఈసీ గ్రూపులు తెలుగు, ఇంగ్లిషు మీడియంలో అందుబాటులో ఉన్నాయి. కళాశాలలో ప్రవేశానికి ప్రస్తుతం దరఖాస్తులను స్వీకరిస్తున్నాం.

– బి.హేమ, ప్రిన్సిపాల్, ప్రభుత్వ జూనియర్ కళాశాల, రంగంపేట

వక్ఫ్ చట్టం రాజ్యాంగ విరుద్ధం



షేక్ నిజాం, మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్

సీటీఆర్ఐ: వక్ఫ్ సవరణ చట్టం రాజ్యాంగ విరుద్ధమని, ప్రాథమిక హక్కులను అది ఉల్లంఘిస్తుందని మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ షేక్ నిజాం అన్నారు. వక్ఫ్ సవరణ బిల్లుకు పార్లమెంట్‌లో వ్యతిరేకంగా వైఎస్సార్ సీపీ ఓటు వేసిన విషయం విదితమేనన్నారు. మైనారిటీ సమాజానికి వైఎస్సార్ సీపీ అండగా ఉంటుందన్నారు. ముస్లింలకు ఇబ్బంది లేకుండా చూస్తామని హామీ ఇచ్చిన చంద్రబాబు...ఇప్పుడు వక్ఫ్ చట్టానికి మద్దతిచ్చి మరోసారి ముస్లింలను మోసం చేశారన్నారు. అన్ని మతాలలాగే ముస్లిం మతాన్ని చూడాలని, వారి ఆస్తుల విషయంలో ప్రభుత్వాల జోక్యం అనవసరమన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి



కంబాలచెరువు: స్థానిక చర్చిపేట వద్ద గుర్తు తెలియని వ్యక్తి (సుమారు 45 ఏళ్లు) పడి ఉండటాన్ని స్థానికులు గమనించారు. వారి సమాచారం మేరకు ఒకటో పట్టణ పోలీసులు అక్కడకు వెళ్లి పరిశీలించగా, అతడు మృతి చెంది ఉన్నాడు. అతడి ఆచూకీకి సంబంధించి ఏ ఆధారాలు లభించకపోవడంతో మృతదేహాన్ని ప్రభుత్వాసుపత్రి మార్చురీకి తరలించారు. ఆచూకీ తెలిసిన వారు ఒకటో పట్టణ పోలీసులను సంప్రదించాలని కోరారు.